క్లుప్తంగా

19లోగా పీఎల్‌వీలకు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: పారా లీగల్ వలంటీర్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, విద్యార్థులు, లా విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19 సాయంత్రంలోగా మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టు ద్వారా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు.

కరాటే మాస్టర్‌కు సన్మానం



తెనాలిటౌన్: షి టో రియో కరాటే స్టేట్ మాస్టర్ బ్లాక్ త్రీ డాన్ బెల్ట్ హోల్డర్ యర్రా నాగేశ్వరరావును పట్టణానికి చెందిన ఆయన శిష్యులు దారా రామకృష్ణ దుశాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గురువారం తెనాలి విచ్చేసిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారాలు చేసి దీవెనలు అందుకున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



కొల్లిపర: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం తెల్లవారు జామున ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వారి వద్ద ఎటువంటి పత్రాలు లేక పోవటంతో కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సదరం క్యాంప్‌నకు విశేష స్పందన



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో గురువారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్, ఆర్థోపెడిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. ఈఎన్‌టీ 50, అప్తామాలజీ 50, సైక్రాటిక్ 50, ఆర్థోపెడిక్ 100 మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు. క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వైద్యులు సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు. శుక్రవారం కూడా శిబిరం కొనసాగుతుందని ఆమె చెప్పారు.

ఘంటసాల వెంకటేశ్వర రావు సేవలు నిరుపమానం



తెనాలిటౌన్: సంగీతానికి సాహిత్యానికి సమన్వయం ఉండాలని బావించి పాటలను, పద్యాలను సమకూర్చిన మహనీయుడు స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు సేవలు నిరుపమానమని ఏపీ ప్రజా నాట్య మండలి తెనాలి డివిజన్ అధ్యక్షుడు మాణిక్యరావు కొనియాడారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యుదయ కళాసమితి తెనాలి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. చలనచిత్ర నేపథ్య గాయకునిగా, సంగీత దర్శకునిగా ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని తెలియజేశారు. కార్యక్రమంలో నీలాంబరం, విజయదుర్గా, బొల్లిముంత కృష్ణ, ఉన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆయేషా గత నెల 31వ తేదీన చికెన్ తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

మదిని సేదదీర్చే వాయులీనం

- వయోలిన్ విద్వాంసుడు యల్లమందరాజు కళాప్రతిభ
- నేడు సంస్మరణోత్సవం సందర్భంగా...



యల్లమందరాజుకు సత్కారం (ఫైల్)

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలికి ఖ్యాతిని తీసుకొచ్చిన సంగీత కళాకారుల్లో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు కూరపాటి యల్లమందరాజు ఒకరు. నాలుగు దశాబ్దాలకు పైగా ఎన్నో జాతీయ వేదికలపైన రాణించిన కళాకారుడు. ఎందరో జాతీయస్థాయి ప్రతిభావంతులైన కళాకారులకు వాయిద్యసహకారం అందించారు. ఆయా ప్రదర్శనలను తన కళాప్రతిభతో రక్తికట్టించారు. నేడు తెనాలిలో ఆయన సంస్మరణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యల్లమందరాజును స్మరించుకుందాం. యల్లమందరాజు స్వస్థలం కారంపూడి మండలం భట్టువారిపల్లె. 1932 డిసెంబరు 5న జన్మించారు. తర్వాతికాలంలో సంగీత కళాకారుడుగా తెనాలిలో స్థిరపడ్డారు. చిన్నతనంనుంచీ సంగీతంపై అభిరుచి కలిగిన యల్ల మందరాజు, కాజన విశ్వరూపాచార్య భాగవతుల వద్ద ప్రాథమిక అభ్యాసం చేశారు. భీమవరంకు చెందిన చదలవాడ సత్యనారాయణ, ఆకాశవాణిలో పనిచేసిన సంగీత విద్వాంసుడు 'నాదసుధార్ణవ' అన్నవరపు రామ స్వామి దగ్గర వాయులీన సంగీతాన్ని అభ్యసించారు. 1962లో స్వగ్రామంలో కూరపాటి గోపరాజు భాగవతులుచే ఏర్పాటుచేసిన 'సీతారామ కల్యాణము'కు తొలిసారిగా వాయిద్యసహకారం అందించారు. అందరి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సోలో కచేరీలు చేశారు. 1982లో మచిలీపట్నంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గాత్ర సంగీత కచేరికి వాయులీన సహకారం అందించటం తన జీవితంలో మరపురానిదిగా చెప్పేవారు యల్లమందరాజు. 1964 నుంచి ఆకాశవాణి, విజయవాడ కేంద్రం నిర్వహించిన ఓబీ కార్యక్రమాల్లో లలిత సంగీత కచేరీలకు, సోలో కచేరీలు, ఒకల్ కాన్సర్టుల్లో పాల్గొన్నారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, విశాఖ వంటి నగరాల్లోనూ కచేరీలు నిర్వహించారు. కళల కాణాచి తెనాలిలో నివసిస్తూ వచ్చిన యల్లమందరాజు 2003 ఫిబ్రవరిలో కన్నుమూశారు.

నేడు సంస్మరణోత్సవం

పట్టణానికి చెందిన విఖ్యాత వయోలిన్ విద్వాంసుడు కూరపాటి యల్లమందరాజు సంస్మరణోత్సవం శుక్రవారం జరగనుంది. కార్యక్రమ ఆహ్వానపత్రికను గురువారం సాయంత్రం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధనస్వామి దేవస్థానంలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఇదే ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల్నుంచి ఏర్పాటయే సభకు కూరపాటి అధ్యక్షత వహిస్తారు.

అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర

- అనధికార కట్టడాలు ఉన్నట్లు నిర్ధారణ
- ఆర్డీకి నివేదిక సమర్పిస్తామని బృందం సభ్యులు ప్రకటన

సాక్షి ఎఫెక్ట్



ప్రకాశం రోడ్డులోని భవనాన్ని పరిశీలిస్తున్న టీపీఏ పూర్ణచంద్రారెడ్డి, ఏడీఎం పెంచలయ్య

తెనాలిఅర్బన్: పట్టణంలో నిర్మిస్తున్న అనధికార కట్టడాలను గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గురువారం పరిశీలించింది. భవన నిర్మాణాలకు సంబంధించిన వివరాలను సేకరించడంతో పాటు అనుమతులపై ఆరా తీశారు. వీటన్నింటిపై నివేదిక తయారు చేసి మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ మధు కుమార్‌కు నివేదిక సమర్పించనున్నట్లు వారు ప్రకటించారు. 'చేయి తడుపుకో.. భవనాలు నిర్మించుకో' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం కథనం వెల్లువడిన విషయం తెలిసిందే. టౌన్‌ప్లానింగ్ విభాగ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ తన కార్యాలయంలో పనిచేసే టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ పూర్ణచంద్రారెడ్డి, ఏడీఎం పెంచలయ్యలను తెనాలి పంపారు. వారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సాక్షి కథనంపై టౌన్ ప్లానింగ్ అధికారులతో విచారణ జరిపారు. వారితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అనుమతి లేకుండా కట్టడాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం మారీసుపేట, నందులపేట, ప్రకాశంరోడ్డు, కొత్తపేట, తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను పరిశీలించి యాజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. వెంటనే ప్లాన్‌కు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని ప్రోత్సహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబశివరావపై చర్యలకు ప్రతిపాదించనున్నట్లు వారు సాక్షికి తెలిపారు. వారు పరిశీలించిన వాటిలో 9 అక్రమ కట్టడాలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు చెప్పారు. వారి వెంట ఏసీపీ శివన్నారాయణ, టీపీవో సాంబశివరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

పోషణ–చదువు రెండూ ముఖ్యమే

అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో సునీత దిశనిర్దేశం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో సునీత

తెనాలిటౌన్: పోషణ ఎంత ముఖ్యమో – చదువు అంతే ముఖ్యమని అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డాక్టర్ సునీత తెలియజేశారు. స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ భీ – పదాయి భీ శిక్షణ కార్యక్రమం అంగన్‌వాడీలు అంకిత భావంతో అమలు చేయాలని పిలుపునిచ్చారు. తెనాలి ప్రాజెక్టు పరిధిలోని పట్టణ, రూరల్, కొల్లిపర మండలాలకు సంబంధించి 200 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నాలుగు ప్రదేశాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, కొలకలూరు జడ్పీ హైస్కూల్, కొల్లిపర మండలం మున్నంగిలో ఈ కార్యక్రమాలు ఆరంభించినట్లు తెలియజేశారు. బాలల సంరక్షణ, అభివృద్ధి, విద్యను సమగ్రంగా నేర్పించడం ముఖ్య ఉద్దేశంగా వెల్లడించారు. ఈసీసీఈ పాఠ్యంశాలు, బోధన విధానాలపై ప్రాథమిక అవగాహనతో అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని అభివృద్ధి పరచనున్నట్లు వివరించారు. సూక్ష్మ పోషక లోపాలతో సహా పోషకాహారంపై అంగన్‌వాడీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నాలుగు బ్యాచ్‌లుగా మూడు రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. బ్యాచ్‌కు 40 నుంచి 50 మంది అంగన్ వాడీలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

సూపర్‌వైజర్లకు ఈ కార్యక్రమంపై ప్రత్యేక ట్రెనింగ్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం మాస్టర్ ట్రెనర్లుగా అంగన్‌వాడీలకు సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.సౌజన్య, వై.నాగమణి, తదితరులు ఉన్నారు.

ఈ శ్రమ కార్డ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ సుభాని



కార్డు గురించి అవగాహన కల్పిస్తున్న సుభాని

కొల్లిపర: మండలంలోని వివిధ గ్రామాలల్లో ఉన్న ప్రతి భవన నిర్మాణ కార్మికులు రూ.110 రూపాయలతో ఈ శ్రమ కార్డ్స్ కోసం దగ్గరలో ఉన్న సి.ఎస్.సి సెంటర్స్‌లలో ఆన్‌లైన్ లో నమోదు చేసుకుని కార్డ్ పొందాలని, అప్పుడే ప్రభుత్వం వారికి కల్పిస్తున్న వివిధ పథకాలు వారి వర్తిస్తాయని లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ బీఎం సుభాని సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు, యానిమేటర్స్‌లు ఈ శ్రమ కార్డ్స్ వలన కార్మికులకు కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో మహిళల కార్మికులు ఈ శ్రమ కార్డు పొంది ఉంటే వారికి రెండు కాన్పులకు రూ.20 వేలు చొప్పన ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్డు పొందిన ప్రతి కార్మికులకు యాక్సిడెంటల్ గా డెత్ జరిగితే రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.60 వేలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ అయితే రెండు లక్షలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కార్మికులు ఆన్‌లైన్‌లో నమోదు కోసం దగ్గరలో ఉన్న సచివాలయంలో వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో వారి వెంట ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్, బ్యాంక్ అకౌంట్ తీసుకుపోవాలన్నారు. ఈ శ్రమ కార్డు గురించి ప్రతి డ్వాక్రా మహిళలు వారి పరిసర ప్రాంతాల్లోని కార్మికులకు అవగాహన కల్పించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనేలా కృషి చేయాలన్నారు. కావున మండలంలోని ప్రతి భవన కారికులు ఈ శ్రమ కార్డు పొంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి.రమాదేవి, యానిమేటర్స్‌లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు కావాలి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: పన్నులను ఈ నెలాఖరులోపు నూరుశాతం వసూలు చేసే విధంగా అందరూ చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వివీం లక్ష్మీపతిరావు ఆదేశించారు. 30వ వార్డులోని సచివాలయంలో ఇంటి పన్నులపై ఉద్యోగులతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పన్నుల వసూలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో బకాయిదారుల వివరాలను సేకరించి వారితో పన్నులు చెల్లించే విధంగా చూడాలన్నారు. అనంతరం 32, 37 వార్డు సచివాలయాలను పరిశీలించి వారికి ఇంటి పన్నుల వసూలపై సూచనలిచ్చారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎంవీఐ రాఘవరావు

తెనాలిరూరల్: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు విధిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, వాహన చోదకుల రక్షణ కోసమే నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా తమను తాము రక్షించుకోగలరని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన బాధితులను గోల్డెన్ అవర్లో ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి తక్షణ వైద్య సహాయాన్ని అందించడం ద్వారా ప్రాణాలను రక్షించిన వారవుతారని తెలిపారు. సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు, లారీ ఓనర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


తెనాలిరూరల్: ఆర్థిక సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక రామలింగేశ్వరపేటకు చెందిన ముత్యాల ఇంద్రాణి (34) బుధవారం రాత్రి పొద్దుదపోయాక ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ఇంద్రాణి భర్త శ్రీనివాసరావు డెకరేషన్ వ్యాపారం చేస్తుండగా వీరికి 15 ఏళ్ల కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. తెనాలి పురవేదిక వద్ద నారకొట్టు ఉండగా తాళ్లు, పట్టాలు వంటివి హోల్‌సేల్‌గా విక్రయాలు జరుపుతుంటారు. అయితే ఆర్థిక లావాదేవీల కారణంగా ఇంద్రాణి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందింది. దీనిపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

గుండెపోటు బాధితులకు ఆపద్బాంధవి టెనెక్టిప్లేస్

- గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంట అత్యంత కీలకం
- కొల్లిపర సీహెచ్‌సీలో అందుబాటులోకి ఇంజక్షన్
- కొల్లిపర వైద్యులు శ్రావణి, సుప్రియా చౌదరి వెల్లడి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టరు శ్రావణి, డాక్టరు సుప్రియా చౌదరి



ఇంజక్షన్

కొల్లిపర: గుండె పోటు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడటానికి అత్యవసరంగా అందించే రూ.45 వేల రూపాయలు విలువ కలిగిన ప్రత్యేకమైన టెనెక్టిప్లేస్ ఇంజక్షన్ ఇక నుంచి మండల కేంద్రంలో ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో కూడా 24 గంటలు అందుబాటులో ఉంటుందని సి.హెచ్.సీ మెడికల్ ఇన్‌చార్జి డాక్టరు పొన్న శ్రావణి, డాక్టర్ ఇ.సుప్రియా చౌదరి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు స్టెమీ గుండె భరోసా సదస్సులో భాగంగా ప్రజలకు, ఏఎస్‌ఎంలు, ఆషా కార్యకర్తలు, సిబ్బందికి, గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ ఎవరికైనా ఎటువంటి సమయంలోనైనా ఛాతీ నొప్పి- ఎడం భుజం లాగటం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ తప్పి పడిపోవటం ఇటు వంటి లక్షణాలు ఉంటే గుండె జబ్బు లక్షణంగా గ్రహించాలన్నారు. వెంటనే 108కి ఫోన్ చేసి, లేదా ఇంటో వారికి సూచనలు తెలిపి సొంత వాహనం ద్వారా అయినా మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెంటనే తీసుకురావాలన్నారు. వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెపోటు అయితే వెంటనే వైద్యశాలలో అందుబాటులో ఉన్న టెనెక్టిప్లేస్ ఇంజక్షన్ అందించి వారి ప్రాణాలు కాపాడటం జరుగుతుందన్నారు. డాక్టరు ఇ.సుప్రియా చౌదరి మాట్లాడుతూ గుండె పోటు లక్షణాలు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు రావాలన్నారు. గంట లోపు చికిత్స అందించకపోతే ప్రాణాహానికి అవకాశం ఉందని తెలిపారు. వివిధ గ్రామాల్లోని ప్రజలు గుండెపోటు వచ్చిన సమయంలో ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, వైద్య సేవలు పొందాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కె.కావ్య, పి.స్వప్న, పి.మణికర, జి.గంగాధర్‌రావు, జి.అనుష, రత్నగిరి, హెడ్ నర్సు కె.సుజాత, నర్సులు కె.చెంచమ్మ, బి.వెంకటేశ్వరమ్మ బాయి, అనురాధ, గోపి, అశోక్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ప్రజలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనుల విందుగా శ్రీచక్రస్నానం

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి వారికి శ్రీచక్రస్నానం చేశారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆరు గంటల నుంచే ధ్వజ అవరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ నిర్వహించారు. ముందురోజున శ్రీవారి రథోత్సవం పట్టణ పురవీధుల్లో వేడుకగా జరిగింది. ఊరేగింపునకు ముందుగా కళాకారుల ప్రదర్శనలను పురప్రజలను ఆకట్టుకున్నాయి.

వైద్యుడి మృతికి ఐఎంఏ సభ్యుల సంతాపం

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన పాథాలజిస్ట్ డాక్టర్ వి. దేవేంద్రనాథ్ బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సాంబి రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, డాక్టర్ జె వి సుబ్బారావు గారు, డాక్టర్ జి. సాంబశివరావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గాయాలు

తెనాలిరూరల్: కారు ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన తెనాలిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాండురంగపేటకు చెందిన ముక్కామల మధుబాబు స్కూటీపై వెళుతుండగా ఫ్లైఓవర్ వంతెనపై ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి

వ్యవసాయశాఖ తెనాలి సహాయ సంచాలకులు ఉషారాణి



మాట్లాడుతున్న ఏడీఏ ఉషారాణి

తెనాలిటౌన్: వ్యవసాయశాఖ– రెవెన్యూశాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు వ్యవసాయశాఖ తెనాలి సహాయ సంచాలకులు ఉషారాణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయభూమి యాజమానుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టినట్లు వెల్లడించారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ వెంట తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళితే వ్యవసాయ సహాయకులు రైతుకు రిజిస్ట్రేషన్ చేసి యునిక్ నెంబర్ ఇస్తారని తెలియజేశారు. దీనివలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయని వెల్లడించారు. పంట రుణాలు, పంటల బీమా, పంట కొనుగోలు ఇకపై ఈ నెంబర్ ద్వారా మాత్రమే సమర్థవంతంగా అమలు చేయబడతాయని చెప్పారు. రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

సుందర తెనాలి రూపకల్పనలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ బండి శేషన్న, ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: సుందర తెనాలి రూపకల్పనలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న సోర్స్ – రీసోర్స్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజలు వీటిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతి రావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యూనిక్ నంబరుకు నమోదు చేసుకోవాలి



దుగ్గిరాల: రైతులందరూ తమ పాసుబుక్, ఆధార్ కార్డులను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఏడీఏ ఉషారాణి సూచించారు. మండల గ్రామమైన కంఠంరాజు కొండూరులో గురువారం వ్యవసాయశాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఇస్తున్న యునిక్ నంబర్ల కోసం నమోదు చేయించుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మండల పరిధిలో ఉన్న రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయించుకోని వారు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈవో రాజవంశీ, పలువురు వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సీఈఏ ఆధ్వర్యంలో పెదవడ్లపూడిలో జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ రోజుల నిల్వ చేసిన పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వుశాతం ఎక్కువగా పేరుకుపోతుందని వివరించారు. సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు నిర్వహించారు.